క్లుప్తంగా

మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌గా అప్పన ప్రసాద్



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న అప్పన ప్రసాద్ (ఫైల్)

పెదవేగి : లక్ష్మీపురంలోని దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ నేత అప్పన ప్రసాద్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఈ విషయాన్ని ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా అప్పన ప్రసాద్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ అభివృద్ధికి, నిమ్మ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.

రేపు సత్యవోలులో చిన్న అశ్రమ్మతల్లి జాతర

పెదపాడు : మండలంలోని సత్యవోలులో ఈనెల 14న చిన్న అశ్రమ్మతల్లి జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఘంటా వారి ఆడపడుచు ఇంటి ఇలవేల్పు అయిన ఆశ్రమ తల్లి అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారిని కొలిచే భక్తులు బోనాలు సమర్పిస్తారని చెప్పారు. అనంతరం భారీ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని మొక్కుబడులు చెల్లిస్తారన్నారు. ఆరోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని, భక్తులు జాతర మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

రూ. 3.95 లక్షలకు లడ్డూ వేలం

బుట్టాయగూడెం : రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా 5 రోజులపాటు పూజలందుకున్న లడ్డూ వేలం పాటను చివరి రోజును శనివారం రాత్రి ఆలయ కమిటీ వారు నిర్వహించారు. ఈ లడ్డూను హైదరాబాద్‌కు చెందిన గగన్ విహారి అనే యువకుడు రూ.3 లక్షల 95 వేలకు వేలం పాడి దక్కించుకున్నాడు. అదేవిధంగా స్వామివారి వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను లక్ష్మణాచారి అనే వ్యక్తి రూ.12,500 వేలంలో దక్కించుకున్నాడు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన డీఎస్పీ లతాకుమారి, సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై ఎం.జయబాబుతో పాటు పోలీస్ సిబ్బందిని ఆలయ కమిటీవారు అభినందించారు.

సర్పంచ్ వెంకాయమ్మకు ఎమ్మెల్యే అభినందనలు



సర్పంచ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : ఇటీవల ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ఢిల్లీ స్థాయిలో అవార్డు అందుకున్న సర్పంచ్ తెల్లం వెంకాయమ్మను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదివారం అభినందించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుట్టాయగూడెం వచ్చిన ఎమ్మెల్యే బాలరాజును సర్పంచ్ వెంకాయమ్మ కలిశారు. ఈ సందర్భంగా అవార్డు రావడానికి చేసిన కృషిని వివరించారు. ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ వెంకాయమ్మను ఆదర్శంగా తీసుకుని అన్ని మండలాల్లోని సర్పంచ్‌లు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిరేవులో వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజలందరికీ ప్రభుత్వమే ఉచితంగా వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కుమ్మరి రేవులో పేదల కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన రవి మాట్లాడుతూ సీపీఎం పేదల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ ఈడుపుగంటి ఠాగూర్ ప్రసాద్, డాక్టర్ జీసీవీ రాధాకృష్ణ, డాక్టర్ ప్రసాద్ నాయక్ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర శాఖ నాయకులు పీ. కిషోర్, బీ. జగన్నాథరావు పాల్గొన్నారు.

దాసరోజుకు అవార్డు

కొయ్యలగూడెం: కళా విశారద అవార్డుకు కాత్యాయని పీఠాధిపతి, బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసరావు ఎంపికైనట్లు విశ్వ కర్మ పీఠం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎన్ఎస్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా చుట్టగుంటలో పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈనెల 19వ తేదీ ఈ అవార్డును అందజేస్తామన్నారు. ఆదివారం స్థానిక కాత్యాయని పీఠంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరుకు చెందిన విశ్వకర్మ పీఠం చారిటబుల్ ట్రస్ట్ మూడేళ్లుగా ఉగాదిని పురస్కరించుకొని పురస్కారాలు అందజేస్తోందని తెలిపారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారం దాసరోజుకు దక్కిందన్నారు. సనాతన హైందవ సంస్కృతి సంప్రదాయాలను దేశంలో నలుమూలల విస్తరింప చేస్తున్న వ్యక్తులను ఎంపిక చేసి కళావిశారద అవార్డును అందచేస్తున్నామన్నారు.

పేదల అభివృద్ధే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- ఘనంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు
- కేక్ కట్ చేసిన ఎమ్మెల్యేలు అబ్బయ్య చౌదరి, వాసుబాబు
- జెండా ఎగురవేసి సంబరాలు జరుపుకున్న పార్టీ శ్రేణులు



పెదపాడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, పార్టీ నేతలు



గణపవరం పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు

పెదపాడు : పేదల అభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదపాడు బళ్లరేవుతూము సెంటర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు గుబ్బల తమ్మయ్య, పెదపాడు సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి, సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, మండల కన్వీనర్ అప్పనప్రసాద్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, సీనియర్ నాయకుడు గారపాటి భాస్కరరావు పార్టీ ఆవిర్భావం, కార్యకర్తల కృషిని వివరించారు. మండలంలోని 23 గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు వాడ వాడలా ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు జెండా ఆవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. పలుచోట్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. అప్పనవీడులో మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, ఎంపీటీసీ బుద్దే రామసీత పాల్గొన్నారు.

చేబ్రోలులో...

ఉంగుటూరు : చేబ్రోలులో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం పార్టీ జెండాను గ్రామ పార్టీ అధ్యక్షుడు ముత్త బుజ్జి ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంపీటీసీలు రాయిలక్ష్మి మనసాల నాగమణి, మాజీ సర్పంచి కరణం బుజ్జి, నాయకులు ఆకుల రాజా, గేదల వినాయకరావు, వల్లూరి హనుమంతురావు పాల్గొన్నారు. నారాయణపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఉపసర్పంచి అడపాశ్రీను, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, ఎంపీటీసీ బండారు నాగరాజు, ఆరవెల్లి మహాలక్ష్మి, ఆర్‌బీకే చైర్మన్ మతుకుమల్లి శ్రీధర్‌బాబు, బొబ్బిలి నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు సేపాను బాలు పెంటా రామకృష్ణ, నేతురు గంగాధర్, లావేటి వీరాచార్యులు, చాపల చేసురత్నం, అక్కిన రామకృష్ణ, పెనుమాక విజయబాబు, తాడిగడప వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెదవేగి మండలంలో...

పెదవేగి : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా పెదవేగిలోని తురాయి చెట్టు సెంటర్ వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకలు అంబరాన్నంటాయి. ఎంపీపీ తాతా రమ్యకుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, సొసైటీ చైర్మన్ పెనుమాక వెంకట సుబ్బారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, తాతా మాణిక్యం, కొనకళ్ల వెంకటేశ్వరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. లక్ష్మీపురంలో ఎంపీపీ తాతా రమ్యకుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. మేడికొండ కృష్ణారావు, సొసైటీ అధ్యక్షులు పెనుమాక వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. దుగ్గిరాలలో ఎంపీటీసీ సరోజిని దేవానంద్ పార్టీ జెండా ఆవిష్కరించారు. తాళ్ళగోకవరంలో గుత్తా ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దెందులూరులో ఉత్సాహంగా...

దెందులూరు : దెందులూరు వైఎస్సార్ జగనన్న బస్టాండ్ సెంటరులో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గ్రామ అధ్యక్షులు పోకల రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. పాదయాత్రలో చేసిన ప్రతి హామీని నెరవేర్చడమే కాకుండా నిరంతరం ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నెల రోజుల లోపు దెందులూరు నియోజకవర్గంలో దాదాపు రూ. 500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తెలిపారు. కనకదుర్గమ్మ అమ్మవారి ట్రస్టుబోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరి మేలు కోరే గొప్ప మహానాయకుడన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమ్మ శివరామకృష్ణ, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఎంపీటీసీలు తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, సప్ప మురళి, కొంగర రత్నకుమార్ అబ్బాస్, వన్నెకూటి సుందరం, సొసైటీ అధ్యక్షులు కొలుసు గణపతిరావు, పులిపాటి శ్యామలాదేవి పాల్గొన్నారు. శ్రీరామవరం, కొవ్వలిలో మండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. భారీ కేక్‌ను ఎమ్మెల్యే, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత కట్ చేశారు. నాయకులు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అక్కినేని శ్రీనివాసరావు, కామిరెడ్డి బాలు, మామిడి రాంబాబు, కొత్తపల్లి రాఘవులు పాల్గొన్నారు. జోగన్నపాలెంలో పార్టీ గ్రామకమిటీ అధ్యక్షులు నిట్టా గాంధీ ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు.



అప్పనవీడులో పార్టీ శ్రేణుల సంబరాలు



పెదవేగి తురాయి చెట్టు సెంటర్ వద్ద..

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ రాజ్యం

గణపవరం : వైఎస్సార్‌సీపీ తోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం పార్టీ 13వ ఆవిర్భావది నోత్సవాన్ని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ కుల, మత, వర్గ, ప్రాంత, పార్టీ బేధాలు లేకుండా సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రజాబలంతో మళ్లీ అధికారంలోకి వస్తుందని, ఈసారి 175 స్థానాలలలో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి మద్దతు కోరాలన్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి, పార్టీ పతాకాన్ని వాసుబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు మండలాల జెడ్పీటీసీలు దేవారపు సోమలక్ష్మి, కోడే కాశీ, ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, వ్యవసాయ సలహా సంఘం జిల్లా చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, రెండు మండలాల పార్టీ కన్వీనర్‌లు దండు రాము, సంకు సత్యకుమార్, గణపవరం, బువ్వనపల్లి సర్పంచ్‌లు మూర అలంకారం, కిలారు సత్యవతి, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవ, వైస్ సర్పంచ్ వెల్లంకి నరేష్, పార్టీ నాయకులు పుప్పాల చినబాబు, కన్నబాబు, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, సువర్ణేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కూసంపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలులో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



నారాయణపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు



దెందులూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



జోగన్నపాలెంలో పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న పార్టీ నేతలు

క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

భీమడోలు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సూచించారు. పూళ్లలోని శ్రీగణపతి వర్తక కల్యాణమండపం వద్ద ఆదివారం పూళ్ల, ఎంఎంపురం, కోడూరుపాడు, దుద్దేపూడి గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై వారికి దిశానిర్దేశం చేసారు. తొలుత వైఎస్సార్ సీపీ 13వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వాసుబాబు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆత్మీయ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి అర్హుల చెంతకే సంక్షేమ పథకాలను అందజేస్తూ ప్రజలందరి నమ్మకాన్ని చూరగొన్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఎవరైనా అర్హులకు పథకాలు అందకపోయినా వారిని గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల లక్ష్యమన్నారు. పార్టీలో ఈ వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు ఉందని, పార్టీ కార్యక్రమాలు వారి భాగస్వామ్యంలో జరుగుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు సచివాలయా కన్వీనర్లు, గృహసారధులు ఐక్యతతో ఉండి బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో , ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, పూళ్ల, కురెళ్లగూడెం, కోడూరుపాడు, దుద్దేపూడి సర్పంచులు దాయం సుజాత ప్రసాద్, గుడివాడ నాగగౌతమి, సీతారామాంజనేయులు, మానుకొండ నాగేశ్వరరావు, నీలం శ్రీనివాసరావు, జగన్ సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, రాష్ట్రకార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు బొల్లారపు జ్ఞానరమ్య పవన్, గొండు కృష్ణ చైతన్య, గంటా శ్రీనివాసరావు, పాల్నాటి శ్రీను, ఏఎంసీ ఉపాధ్యక్షులు పులిచర్ల వెంకటకృష్ణారావు, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూళ్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

పుస్తక పఠనంతో ఎన్నో లాభాలు

భీమడోలు : భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం జరిగింది. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు సామూహిక పుస్తక పఠనంలో పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో నీతి కథలు, చదువులో రాణించేందుకు సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చిన్నారులకు గ్రంథపాలకులు వివరించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుందని, ఉన్నత స్థితికి చేరుకునేందుకు పుస్తకమే చక్కని సోపానమని అన్నారు. పలు స్ఫూర్తిదాయక కథలను చిన్నారులకు వివరించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమడోలులో సామూహిక పుస్తక పఠనంలో పాల్గొన్న చిన్నారులు

చలో ఢిల్లీ విజయవంతం చేయండి

పెదవేగి : ఎస్సీ వర్గీకరణ పట్ల బీజేపీ ప్రభుత్వం చేస్తున్న నమ్మక ద్రోహంపై ఈనెల 27, 28 తేదీల్లో ధర్మశంఖారావం పేరుతో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దెందులూరు నియోజకవర్గ ఎంఎస్ఎఫ్, ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పెదవేగి మండలంలో చలో ఢిల్లీ కరపత్రాలను నేతలు ఆదివారం ఆవిష్కరించారు. జాతి ఐక్యతకు కలసికట్టుగా పోరాడి, అన్యాయానికి గురవుతున్న మాదిగ బిడ్డల అభ్యున్నతికి పాటుపడాలని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దాల తిరుపతిరావు, ఇతర నాయకులు కొత్తపల్లి మురళి, జొన్నకూటి జాన్, మద్దాల మికాయేలు, యర్రా రఘు, చొదిమెళ్ల ప్రసాద్, యర్రా ఆనంద్, అబ్బదాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ నేతలు

ఒంటి పూట బడుల షెడ్యూల్ విడుదల చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవి కాలంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే ఒంటిపూట బడుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర రావు కోరారు. ఆదివారం స్థానిక డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వి.గంగాధర రావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కోసం అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులకు వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించి నియామక పత్రాలు ఇవ్వాలని కోరారు. అలాగే పాఠశాలలకు పెండింగ్ గ్రాంటులు వెంటనే విడుదల చేయాలని, ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ. ఉదయ భాస్కర్, రాష్ట్ర గౌరవ సలహాదారు మరడాని అచ్యుతరావు, మండలాల అధ్యక్షులు ఎస్. రాంబాబు, ఎస్. అబిద్, బీ. మోహన రావు, చేబ్రోలు పెద్దిరాజు, ఆర్. శేఖర్ బాబు పాల్గొన్నారు.

రత్న కళాశాలగా మార్పు

భీమడోలు : రాష్ట్ర ఉన్నత విద్యా మండలి భీమడోలులోని శ్రీకాకతీయ డిగ్రీ కళాశాల పేరును రత్న డిగ్రీ కళాశాలగా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంటెంట్ కె.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉత్తర్వుల మేరకు పేరును మార్చామని, విద్యార్థుల తల్లిదండ్రులు, యువతీ యువకులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

జంగారెడ్డిగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థలకు సంబంధించి సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఏలూరులోని పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుంది. పోలింగ్ ఏర్పాట్లను ఆర్డీవో డాక్టర్ ఎం.ఝాన్సీరాణి, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో ఝాన్సీరాణి చెప్పారు.

పటిష్ట బందోబస్తు

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పి.బాల సురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో బారికేడ్‌లు ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించినట్లు డీఎస్పీ చెప్పారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్, వాటర్‌బాటిల్, ఇంకు బాటిళ్లు తీసుకు రావడాన్ని నిషేదించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 169 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇద్దరు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు, 16 మంది ఎస్సైలు, ఏఎస్సైలు 13 మంది, 69 మంది కానిస్టేబుళ్లు విధుల్లో పాల్గొంటారన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీలు కేవీ సత్యనారాయణ, కె.లతాకుమారి

వివాద స్థలంలో ప్రవేశిస్తే చర్యలు

జంగారెడ్డిగూడెం : వివాదంలో ఉన్న స్థలంలోకి ఎవరూ ప్రవేశించరాదని, విచారణ పూర్తయి తీర్పు వచ్చేంతవరకు ఎవరైనా ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.స్లీవజోజి హెచ్చరించారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్ఎస్ నెంబర్ 449లో కొయ్యలగూడెంకు చెందిన చిన్నం కోటేశ్వరరావుకు 5 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిలోకి మద్దిపాటి భద్రం, తగరం ఇస్మాయేల్, తగరం శ్రీను, వసంతాటి మంగరాజు, పేరి ప్రసాద్, షాన్ బాషా, మరికొందరు నకిలీ పట్టాలు సృష్టించి అక్రమంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై ఎం.సాగర్‌బాబు శాంతిభద్రతల దృష్ట్యా ఈ ఫిర్యాదును తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేసి విచారణ నిర్వహించాలని కోరారు. దీంతో ఈ కేసుకు సంబంధించి ఇరువర్గాలు ఈ స్థలంలోకి ప్రవేశించరాదని, ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు సంబంధిత పత్రాలతో ఇరువర్గాలు తహసీల్దార్ కోర్టుకు హాజరు కావాలని మండల మేజిస్ట్రేట్ స్లీవజోజి ఆదేశించి నోటీసులు జారీ చేశారు.

పౌష్టికాహారం అందజేత

ఏలూరు రూరల్: రివర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏలూరు గొల్లాయిగూడెం ఏటిగట్టు పరిసరాల్లో నివసిస్తున్న పేద యానాదుల కుటుంబాలను సందర్శించారు. వీరిలో అధిక సంతానం కలిగి ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రెండు కుటుంబాలను గుర్తించారు. వారికి అవగాహన కల్పించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఆవశ్యతను వివరించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఒప్పించి మహిళలను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించారు. వారికి పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.